క్లుప్తంగా

మైలవరంలో నూరుశాతం పింఛన్ల పంపిణీ

మైలవరం: మండలంలో నూరు శాతం పింఛన్లు పంపిణీ చేశామని ఎంపీడీఓ లక్ష్మీకుమారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మైలవరం మండలంలో 9627 మంది పింఛను లబ్ధిదారులకు సంబంధించి రూ.2,66,32,250 మంజూరయినట్లు వివరించారు. మొదటి రోజు 7932 మందికి పంపిణీ చేయగా, మిగిలిన వారికి గురు, శుక్రవారాల్లో పంపిణీ చేసినట్టు పేర్కొన్నారు.

ఆయిల్‌పామ్ సాగుపై అవగాహన సదస్సు

రెడ్డిగూడెం: మండలంలోని కూనపరాజుపర్వ గ్రామంలో ఉద్యానశాఖ, పతంజలి ఫుడ్ లిమిటెడ్ కంపెనీ సహాయంతో ఆయిల్‌పామ్ సాగుపై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సులో ఆయిల్‌పామ్ డీజీఎం వీరేంద్రచౌదరి మాట్లాడుతూ ఆయిల్‌పామ్ మొక్కలు జూన్-జూలైల నుంచి 1.5 లక్షల మొక్కలు అందుబాటులో ఉంటాయని, మరో మూడు నెలలకు ఒక లక్ష మొక్కలు అందుబాటులోకి వస్తాయని, మొత్తం 2.5 లక్షల మొక్కలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఉద్యాన అధికారి బి.నరేంద్ర కుమార్ మాట్లాడుతూ ఆయిల్‌పామ్ కావాల్సిన రైతులు ఆర్‌బీకేలో ఉన్న వీఏఏ, వీహెచ్‌ఏలను సంప్రదించాలన్నారు.

మత్తు పదార్థాలతో భవిష్యత్తు నాశనం



వెలగలేరు జెడ్పీ హైస్కూల్లో డ్రగ్స్‌పై అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ ధర్మరాజు

జి.కొండూరు: మత్తు పదార్థాలకు అలవాటు పడిన వ్యక్తుల ఆరోగ్యంతో పాటు చట్టపరమైన చిక్కుల్లో పడి బంగారు భవిష్యత్తు ప్రమాదకరంగా మారుతుందని జి.కొండూరు ఎస్‌ఐ ధర్మరాజు అన్నారు. మండల పరిధిలోని వెలగలేరు జిల్లా పరిషత్ హైస్కూల్లో శుక్రవారం యాంటీ డ్రగ్స్‌పై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డ్రగ్స్ వాడకం వల్లన కలిగే నష్టాలను విద్యార్థులకు వివరించారు.

విశ్వనాథ్ మృతికి ఘన నివాళి

గంపలగూడెం: ప్రముఖ సినీ దర్శకుడు కె.విశ్వనాథ్ మృతికి గంపలగూడెంలో శుక్రవారం ఆయన అభిమానులు ఘన నివాళి అర్పించారు. స్థానిక బస్‌స్టాప్ సెంటర్లో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ప్రగాఢ సంతాపం ప్రకటించారు. ఆయన మృతి తెలుగు సినీ రంగానికి తీరని లోటని, ఆయన సినిమాలు ఒక్కొక్కటి ఒక కళాఖండమని పలువురు కొనియాడారు. కార్యక్రమంలో ఎ.సూర్య ప్రకాష్, కె.హరి, కె.చిన్న వీరభద్రం, చారుగుండ్ల బద్రి, పి.శివశంకర్, బి.రామకృష్ణ పాల్గొన్నారు.

వైభవంగా బాలరావమ్మ తిరునాళ్ల



ఆగిరిపల్లి: మండల పరిధిలోని తోటపల్లి, కనసానపల్లి, ఆగిరిపల్లి గ్రామాల్లో ఉన్న దుగ్గిరాల బాలరావమ్మ మాఘపూర్ణిమ తిరునాళ్లు శుక్రవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. తోటపల్లిలో ఉదయం విఘ్నేశ్వర పూజ, మండపారాధన, అఖండ దీపారాధన, నీరాజన మంత్రపుష్పం, అమ్మవారికి పంచామృతాభిషేకం, విశేష అలంకరణ జరిపించారు. మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఈవో ఘంటసాల శ్రీనివాసరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఆగిరిపల్లి, కనసానపల్లి బాలరావమ్మ తల్లి ఆలయాల్లో భక్తులు విశేషంగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

8న మారెమ్మ దేవస్థానం హుండీ కానుకల లెక్కింపు

విస్సన్నపేట: మండలంలోని పుట్రేల గ్రామంలో ఉన్న మారెమ్మ అమ్మవారి దేవస్థానం హుండీ కానుకలను ఈ నెల 8వ తేదీ ఉదయం 10.30 గంటలకు లెక్కించనున్నట్లు ఆలయ ఈఓ వై.సీతారామయ్య శుక్రవారం తెలిపారు. దేవదాయ శాఖ అధికారి పర్యవేక్షణలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ కోటగిరి సునీల్‌బాబు, రెవెన్యూ, పోలీస్ అధికారులు, ధర్మకర్తలమండలి సభ్యులు, భక్త సమాజ సభ్యుల సమక్షంలో హుండీ కానుకల లెక్కింపు జరుగుతుందన్నారు.

బహిరంగ వేలం

మారెమ్మ అమ్మవారి దేవస్థానంకు చెందిన 6వ నంబరు షాపులో ఒక సంవత్సరం పాటు పూజా ద్రవ్యములు, కిరాణా, ఫ్యాన్సీ వ్యాపారం చేసుకునే అద్దె హక్కునకు 8వ తేదీన దేవస్థానం ప్రాంగణంలో ఉదయం 10 గంటలకు బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ తెలిపారు.

భూముల రీసర్వే పనులు ప్రారంభం



మీర్జాపురంలో డ్రోన్ కెమెరాలతో భూముల సర్వే ప్రారంభిస్తున్న అధికారులు

నూజివీడు: మండలంలోని మీర్జాపురంలో వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకంలో భాగంగా శుక్రవారం సర్వే పనులను రెవెన్యూ, సర్వే శాఖ అధికారులు ప్రారంభించారు. భూముల సర్వేను డ్రోన్లతో నిర్వహించారు. ఈ సర్వే తరువాత భూములకు సంబంధించిన రికార్డులను కచ్చితత్వంతో తయారు చేస్తామని, దీనివల్ల గ్రామాల్లో భూ తగాదాలు సమసిపోతాయని సిబ్బంది తెలిపారు. 100 ఏళ్ల తరువాత రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఈ భూముల రీసర్వేను ఎలాంటి లోటుపాట్లకు తావు లేకుండా పటిష్ఠంగా నిర్వహిస్తోంది. కార్యక్రమంలో రెవెన్యూ, సర్వే శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

పేదరిక నిర్మూలనకు ప్రభుత్వం చర్యలు

వెలుగు జిల్లా ప్రాజెక్టు మేనేజరు శ్రీనివాసరావు



వెలుగు మిత్రల సమావేశంలో మాట్లాడుతున్న ఎన్టీఆర్ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ శ్రీనివాసరావు

తిరువూరు: గ్రామీణ పేదరిక నిర్మూలనకు ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను సమర్థంగా అమలు చేయడంలో వెలుగు మిత్రలు, మండల సమాఖ్యలు సహకరించాలని ఎన్టీఆర్ జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ డీపీఎం శ్రీనివాసరావు కోరారు. తిరువూరు వెలుగు కార్యాలయంలో శుక్రవారం వెలుగుమిత్రలు, మండల సమాఖ్యల అధ్యక్షులతో సమావేశం నిర్వహించారు. వ్యవసాయాధారిత స్వయం ఉపాధి పథకాలను అమలు చేస్తున్నందున తద్వారా అదనపు ఆదాయ వనరులు సమకూర్చుకోవచ్చని, ప్రతి వెలుగు మిత్ర తమ పరిధిలోని స్వయం సహాయక సంఘాల సభ్యులకు అవగాహన కల్పించి ఆయా పథకాలను విజయవంతం చేయాలని సూచించారు. గ్రామ సమాఖ్యల విధులు, వెలుగు మిత్రల బాధ్యతలను వివరించారు. ఫైనాన్స్ డీపీఎం శోభన్‌బాబు, స్త్రీనిధి ఏజీఎం శ్యామల, తిరువూరు మండల వెలుగు ఏపీఎం గురవయ్య, గంపలగూడెం, విస్సన్నపేట, ఎ.కొండూరు మండలాల మహిళా సమాఖ్య ప్రతినిధులు, ఏపీఎంలు పాల్గొన్నారు.

కో-ఆప్షన్ సభ్యునిగా కరీం ఏకగ్రీవ ఎన్నిక



కో-ఆప్షన్ సభ్యునిగా ఎన్నికైన కరీం

గంపలగూడెం: గంపలగూడెం మండల పరిషత్ కో-ఆప్షన్ సభ్యుని ఎన్నిక శుక్రవారం ఏకగ్రీవంగా జరిగింది. కో-ఆప్షన్ సభ్యుడు షేక్ లతీఫ్ ఇటీవల మృతి చెందడంతో ఆ స్థానం భర్తీ చేసేందుకు అధికారులు శుక్రవారం తిరిగి ఎన్నిక జరిపారు. షెడ్యూల్ ప్రకారం నిర్ణీత సమయానికి గంపలగూడెం చెందిన షేక్ కరీం(వైఎస్సార్‌సీపీ) ఒక్కరే నామినేషన్ వేయడంతో ఎన్నిక ఏకగ్రీవంగా జరిగినట్లు ప్రిసైడింగ్ అధికారి, పంచాయతీ రాజ్ డీఈ చక్రవర్తి ప్రకటించారు. అనంతరం కరీంకు నియామక పత్రాన్ని అందజేశారు. నూతనంగా ఎన్నికైన కో-ఆప్షన్ సభ్యుని ఎంపీపీ గోగులమూడి శ్రీలక్ష్మి, జెడ్పీటీసీ శామ్యూల్, పలువురు ఎంపీటీసీ సభ్యులు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వై.పిచ్చిరెడ్డి పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు బానిసలు కావద్దు



గంపలగూడెం హైస్కూల్లో మాట్లాడుతున్న ఎస్‌ఐ సతీష్

గంపలగూడెం: యువత మత్తు పదార్థాలకు బానిసలు కావద్దని ఎస్‌ఐ వి.సతీష్ తెలిపారు. గంపలగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మాదక ద్రవ్యాల వల్ల జరిగే అనర్థాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణ పట్టుదలతో విద్యను అభ్యసించి తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలన్నారు. చెడు అలవాట్లను నేర్చుకుంటే జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరలేరన్నారు. మాదకద్రవ్యాలు, మత్తు పదార్థాల వల్ల ఆరోగ్యం క్షీణిస్తుందని, తక్కువ వయసులోనే పనిచేయలేని స్థితికి వెళ్లే ప్రమాదం ఉందన్న విషయం గ్రహించాలన్నారు. గుట్కా, పాన్‌పరాగ్ లాంటి పదార్థాలు కూడా ఆరోగ్యాన్ని నాశనం చేస్తాయన్నారు. ఎవరైనా మాదక ద్రవ్యాలు తీసుకున్నా, విక్రయించినట్టు తెలిసినా వెంటనే పోలీసుల దృష్టికి తీసుకురావాలన్నారు. బాలికలను వేధించడం చట్టరీత్యా నేరం, అలాంటి అలవాట్లకు పొరపాటున వెళ్లవద్దన్నారు. ప్రధానోపాధ్యాయుడు ఎస్.జమలయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వేతనాలు పెంచాలని సిబ్బంది వినతి



ఎమ్మెల్యే మేకా ప్రతాప్‌కు వినతిపత్రం అందజేస్తున్న ట్రిపుల్‌ఐటీ సెక్యూరిటీ, హౌస్ కీపింగ్ సిబ్బంది

నూజివీడు: ట్రిపుల్ ఐటీలోని నాన్ టీచింగ్ స్టాఫ్‌కు మూడు వేల వరకు వేతనాలు పెంచారని, తమకు కూడా వేతనాలు పెంచాలని కోరుతూ నూజివీడు ట్రిపుల్ ఐటీలోని సెక్యూరిటీ, హౌస్ కీపింగ్ సిబ్బంది శుక్రవారం ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావుకు వినతిపత్రం అందజేశారు. పట్టణంలోని ఎమ్మెల్యే కార్యాలయంకు వచ్చిన వారు ఎమ్మెల్యేతో మాట్లాడుతూ తమకు వేతనాలు పెంచి ఐదేళ్లవుతోందని, ప్రస్తుతం రూ.12 వేలు ఇస్తుండగా, పీఎఫ్, ఈఎస్‌ఐ కటింగ్‌లు పోను రూ.10,500 వస్తున్నాయన్నారు. ఇంటి అద్దెలు, పిల్లల ఫీజులు, పెరిగిన ధరల నేపథ్యంలో ప్రసుతం ఇస్తున్న వేతనాలు సరిపోవడం లేదని, నాన్ టీచింగ్ స్టాఫ్‌కు పెంచిన విధంగానే తమకు కూడా వేతనాలు పెంచేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేను కోరారు. ఆర్జీయూకేటీ ఉన్నతాధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లి న్యాయం చేసేలా చూస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

ప్రజల చెంతకు ప్రభుత్వ పథకాలు



అక్కిరెడ్డిగూడెం కన్వీనర్ల సదస్సులో జెడ్పీటీసీ ప్రతాప్

ముసునూరు: జగనన్న ప్రవేశపెడుతున్న ప్రతి పథకాన్ని కుల, మత, వర్ణ, వర్గ భేదం లేకుండా, అర్హులైన ప్రజలందరికీ చేర్చాలని మండల సచివాలయాల కన్వీనర్, జెడ్పీటీసీ సభ్యుడు వరికూటి ప్రతాప్ సూచించారు. మండలంలోని అక్కిరెడ్డిగూడెంలో శుక్రవారం ఎంపీటీసీ పుచ్చకాయల వెంకటేశ్వరరావు అధ్యక్షతన గ్రామ సచివాలయ కన్వీనర్ల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జగనన్న సృష్టించిన, సృష్టిస్తున్న సంక్షేమ పథకాలన్నీ అర్హులైన లబ్ధిదారులకు చేరేలా నిరంతర కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు బేబి సుజాత, మల్లయ్య, మాజీ ఎంపీటీసీ బర్మా సీతారామయ్య, గ్రామ సచివాలయ కన్వీనర్లు పాల్గొన్నారు.

సురక్షిత ప్రయాణానికి హెల్మెట్ తప్పనిసరి



హెల్మెట్ వాడకంపై చైతన్యం కల్పిస్తున్న రూరల్ ఎస్‌ఐ తలారి రామకృష్ణ

నూజివీడు: రోడ్డు ప్రమాదాల్లో ఎక్కువ మంది హెల్మెట్ లేకపోవడం వల్లే మరణిస్తున్నారని, హెల్మెట్ ధరిస్తే ప్రాణాపాయం నుంచి బయటపడొచ్చని రూరల్ ఎస్‌ఐ తలారి రామకృష్ణ అన్నారు. మండలంలోని మొర్సపూడి వద్ద ఉన్న కార్గిల్ కంపెనీలోని ఉద్యోగులకు శుక్రవారం హెల్మెట్ వాడకంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ ఉద్యోగం నిమిత్తం నేడు ప్రతి ఒక్కరూ ద్విచక్రవాహనం ఉపయోగిస్తున్నారని, హెల్మెట్‌ను ధరిస్తే ఇంటికి క్షేమంగా వెళ్లొచ్చన్నారు. రోడ్డు ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలని, రహదారి భద్రత నియమాలను పాటించాలని సూచించారు.

మాదక ద్రవ్యాల దుష్పరిణామాలపై అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ చంటిబాబు

ఆగిరిపల్లి: విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండి తమ భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాలని ఎస్‌ఐ ఎన్.చంటిబాబు ఉద్బోధించారు. మండలంలోని పోతవరప్పాడులో ఎన్‌ఆర్‌ఐ ఇంజినీరింగు కళాశాలలో మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఎస్‌ఐ చంటిబాబు మాట్లాడుతూ విద్యార్థులు మాదక ద్రవ్యాలకు, ఇతర చెడు వ్యసనాలకు దూరంగా ఉండి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకు రావాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ నాగభాస్కర్ పాల్గొన్నారు.

మత్తు పదార్థాలతో భవిష్యత్తు అంధకారం



కేతనకొండ జానెట్ కళాశాలలో హెల్మెట్ వాడకంపై అవగాహన కల్పిస్తున్న సీఐ పి.శ్రీను, ఎస్‌ఐ శ్రీనివాస్

కేతనకొండ(ఇబ్రహీంపట్నం): మాదక ద్రవ్యాలను వినియోగించి జీవితాలు నాశనం చేసుకోవద్దని ఇబ్రహీంపట్నం సీఐ పి.శ్రీను అన్నారు. కేతనకొండ జానెట్ జూనియర్ కళాశాలలో మాదక ద్రవ్యాల నివారణ, హెల్మెట్ వాడకంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థి దశలో చదువుపై దృష్టి సారించి కృషి పట్టుదలతో ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. రోడ్డుపై వాహనాలు నడిపే సమయంలో హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని తెలిపారు. వాహన రికార్డులు, లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. ఎస్‌ఐ శ్రీను హెల్మెట్ వాడకంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల యాజమాన్యం, విద్యార్థులు పాల్గొన్నారు.

97 శాతం పింఛన్ల పంపిణీ పూర్తి



విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వృద్ధుడికి పింఛను అందజేస్తున్న ఈదర గ్రామానికి చెందిన వలంటీర్

ఆగిరిపల్లి: మండలంలో సామాజిక పింఛన్ల పంపిణీ 97 శాతం పూర్తి చేసినట్లు ఎంపీడీఓ కె.వాణి శుక్రవారం తెలిపారు. మొత్తం 19 గ్రామ సచివాలయాల్లో 9567 పింఛన్లకు 9368 పింఛన్లు పంపిణీ చేసినట్లు వివరించారు.

బలివేలో శివరాత్రి ఏర్పాట్లపై నేడు సమీక్ష

ముసునూరు: ప్రసిద్ధ శైవ క్షేత్రం బలివేలో ఫిబ్రవరి 17 నుంచి 19 వరకు జరగనున్న రామలింగేశ్వర స్వామి మహాశివరాత్రి ఉత్సవ ఏర్పాట్లపై నూజివీడు ఇన్‌చార్జ్ ఆర్డీఓ పెంచల కిషోర్ అధ్యక్షతన శనివారం సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ తల్లాప్రగడ విశ్వేశ్వరరావు తెలిపారు. ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ఆదేశాలతో బలివే గ్రామంలో శివరాత్రి ఏర్పాట్లపై రెండోసారి సమావేశం నిర్వహించి, ఏర్పాట్లపై సమగ్రంగా సమీక్షిస్తామని చెప్పారు. శనివారం మధ్యాహ్నం రెండు గంటలకు బలివే ఆలయ ప్రాంగణంలో ఉత్సవాల నోడల్ అధికారి తహసీల్దార్ దాసరి సుధ ఆధ్వర్యంలో అన్ని శాఖల అధికారులతో ఈ సమన్వయ సమావేశం జరుగుతుందన్నారు.

విధి నిర్వహణలో అలసత్వం తగదు

తిరువూరు: సచివాలయ సిబ్బంది విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని తిరువూరు నగర పంచాయతీ కమిషనర్ బాలకృష్ణ సూచించారు. తిరువూరులోని మూడవ నంబరు సచివాలయాన్ని శుక్రవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. సిబ్బంది సమయపాలన పాటించాలని, ప్రతిరోజూ ప్రజల నుంచి వచ్చే అర్జీలను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని సూచించారు. సంక్షేమ పథకాల లబ్ధిదారుల వివరాలను తెలిపే బోర్డులు స్పష్టంగా ప్రదర్శించాలని, పన్నుల వసూలు వేగవంతం చేయాలని కోరారు.

జగనన్న పాలవెల్లువపై అవగాహన సదస్సు

రెడ్డిగూడెం: జగనన్న పాల వెల్లువ కేంద్రాల్లో పాల సేకరణ పెరిగేలా సిబ్బంది రైతులను ప్రోత్సహించాలని ఎంపీడీఓ శంకరరావు తెలిపారు. మండలంలోని కుదప గ్రామ సచివాలయంలో జగనన్న పాల వెల్లువ కేంద్రం నిర్వహణపై శుక్రవారం సిబ్బందితో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పాల సరఫరా చేసే రైతులకు జగనన్న పాల వెల్లువ పథకం ద్వారా అందజేస్తున్న రాయితీలు, వసతులు, సౌకర్యాల పట్ల రైతులకు అవగాహన కల్పించాలన్నారు. కేంద్ర పరిధిలోని రైతులందరూ పాల వెల్లువ కేంద్రాలకు పాల సరఫరా చేసేలా పర్యవేక్షించాలన్నారు.

భవనం పైనుంచి పడి విద్యార్థినికి గాయాలు

విస్సన్నపేట: మండలంలోని కొండపర్వ గిరిజన బాలికల గురుకుల పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న బాణావతు శిరీష శుక్రవారం భవనం పైనుంచి కింద పడిపోయింది. స్వల్పగాయాలైన శిరీషను విస్సన్నపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం నిమిత్తం 108 వాహనంలో నూజివీడు ఏరియా ఆసుపత్రికి తరలించారు. గురుకుల పాఠశాలలో డార్మెటరీ భవనం పైన ఉండటంతో కిందకు వచ్చే సమయంలో కళ్లు తిరిగి పైనుంచి కిందకు పడిపోయిందని ప్రిన్సిపాల్ స్వర్ణలత తెలిపారు. స్వల్ప గాయాలు కావడంతో ప్రాథమిక చికిత్స చేసి డిశ్చార్జ్ చేశారని తెలిపారు.

షాబుఖారీ బాబా ఆశీస్సులు ప్రజలపై ఉండాలి

కొండపల్లి ఉరుసు ఉత్సవాల్లో ఉప ముఖ్యమంత్రి అంజాద్ బాషా



కొండపల్లి షాబుఖారీ దర్గా ఉరుసు వేడుకల్లో ప్రార్థనలు చేస్తున్న డెప్యూటీ సీఎం అంజాద్ బాషా, ఎమ్మెల్యే మల్లాది విష్ణు తదితరులు

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): హజరత్ సయ్యద్ షాబుఖారీ బాబా ఆశీస్సులు రాష్ట్ర ప్రజలందరిపై ఉండాలని ఉప ముఖ్యమంత్రి, ముస్లిం మైనార్టీ శాఖ మంత్రి అంజాద్ బాషా అన్నారు. కొండపల్లి షాబుఖారీ దర్గా 426వ ఉరుసు మహోత్సవాల్లో ఎమ్మెల్యే మల్లాది విష్ణుతో కలిసి గురువారం రాత్రి ఆయన పాల్గొన్నారు. ఆస్థాన పీఠాధిపతి మహ్మద్ అల్తాఫ్ రజా సాదరంగా వారికి స్వాగతం పలికారు. ఇస్లాం సంప్రదాయ పద్ధతిలో ఘనంగా సత్కరించారు. బాబాకు చాదర్ సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. డెప్యూటీ సీఎం మాట్లాడుతూ దర్గాలో భక్తులకు నిత్యాన్నదానం చేయడం అభినందనీయమన్నారు. మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ షేక్ ఆసిఫ్, ఎంపీపీ పాలడుగు జ్యోత్స్న, వార్డు కౌన్సిలర్లు, మండల నాయకులు పాల్గొన్నారు.

రైల్వే వ్యాగన్ వర్క్‌షాపులో వైద్యశిబిరం



గుంటుపల్లి రైల్వే వ్యాగన్ వర్క్‌షాపు వైద్య శిబిరంలో పరీక్షలు చేస్తున్న డాక్టర్ సుమలత, డాక్టర్ అనీల

గుంటుపల్లి(ఇబ్రహీంపట్నం):గుంటుపల్లి రైల్వే వ్యాగన్ వర్క్‌షాపు కార్మికుల సంక్షేమం దృష్టిలో ఉంచుకుని ఉచిత వైద్యశిబిరం నిర్వహించినట్లు రైల్వే వైద్యశాల వైద్యాధికారి సుమలత అన్నారు. ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా వర్క్‌షాప్ చీఫ్ మేనేజర్ శ్రీనివాసులు సౌజన్యంతో వ్యాగన్ వర్క్‌షాపులో అమెరికన్ అంకాలజీ ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో శుక్రవారం క్యాన్సర్ వ్యాధిపై అవగాహన కల్పించారు. అంకాలజిస్ట్ డాక్టర్ అనీల మహిళా కార్మికులకు క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు జరిపారు. అనంతరం 45మంది రక్తదానం చేశారు. రక్తదానం వలన కలిగే ప్రయోజనాలు వివరించారు.

జక్కంపూడి-కె.తాడేపల్లి గ్రామాలకు సాగునీరు



వీటీపీఎస్ నుంచి కొత్తూరు తాడేపల్లి పొలాలకు వెళుతున్న సాగునీరు

విజయవాడరూరల్: వీటీపీఎస్ నుంచి జక్కంపూడి, షాబాదు, కొత్తూరు తాడేపల్లి గ్రామాల్లోని వరి పొలాలకు శుక్రవారం సాగునీరు రావడంతో ఆ గ్రామాల్లోని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గత పది రోజులుగా వీటీపీఎస్ నుంచి వరి పొలాలకు నీరు రాకపోవడంతో రైతులు ఆందోళన చెందారు. ఈ గ్రామాల్లో దాదాపు 12 వందల ఎకరాల్లో వరినాట్లు వేశారు. కొత్తూరు తాడేపల్లి, జక్కంపూడి, షాబాదు గ్రామాల్లోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎల్.పుండరీకవర్మ, గ్రామ సర్పంచి ఉయ్యూరు గోపాలరావు, పంచాయతీ పాలకవర్గ సభ్యుడు వెంకటేశ్వరరావు, రైతులు సంయుక్తంగా కింది గ్రామాలకు సాగునీరు వచ్చే విధంగా ప్రత్యేకంగా తూములు ఏర్పాటు చేయడంతో వరిపొలాలకు సాగునీరు సరఫరా అవుతున్నాయి. ఈ సీజన్‌కు అవసరమైన సాగునీటికి ఇక ఇబ్బంది వుండదనే అభిప్రాయాన్ని రైతులు వ్యక్తం చేస్తున్నారు.

ఉత్తమ అవార్డు గ్రహీతలకు సన్మానం



గంపలగూడెంలో సన్మానం అందుకున్న అవార్డు గ్రహీతలు

గంపలగూడెం: రిపబ్లిక్ డే సందర్భంగా జిల్లా స్థాయిలో ఉత్తమ అవార్డు పొందిన నలుగురు అధికారులను శుక్రవారం గంపలగూడెంలో ఘనంగా సన్మానించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో మండల పరిధిలో ఉత్తమ అవార్డు గ్రహీతలైన తహసీల్దార్ బాల కృష్ణారెడ్డి, ఊటుకూరు పశువైద్యాధికారి సాయికృష్ణ, మండల పరిషత్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ కె.శివ నాగమల్లేశ్వరరావు, గోసవీడు సచివాలయం కార్యదర్శి కొంగల అశోక్‌లను ఎంపీపీ గోగులమూడి శ్రీలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు కె.శామ్యూల్, ఎంపీడీఓ వై.పిచ్చిరెడ్డి శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. పంచాయతీ రాజ్ డీఈ చక్రవర్తి, ఈఓపీఆర్డీ బాబురావు, గంపలగూడెం పంచాయతీ ఈఓ శ్రీనివాసరెడ్డి, ఆర్‌ఐ మోహన్, వైఎస్సార్‌సీపీ జిల్లా కమిటీ సభ్యుడు సీహెచ్ నర్సారెడ్డి, జి.చెన్నకేశవరెడ్డి పలువురు ఎంపీటీసీ సభ్యులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పెద్ద తిరునాళ్లకు సర్వం సిద్ధం

- భక్తి చానల్ ద్వారా ప్రత్యక్ష ప్రసారం
- ఈ నెల 5 నుంచి 9వ తేదీ వరకు జరగనున్న ఉత్సవాలు



సిద్ధమవుతున్న కల్యాణ వేదిక



లడ్డూ ప్రసాదాలు సిద్ధం చేస్తున్న సిబ్బంది

పెనుగంచిప్రోలు: తిరుపతమ్మవారి కల్యాణ మహోత్సవాల(పెద్ద తిరునాళ్ల) విజయవంతానికి ఆలయ అధికారులు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ తిరునాళ్ల ఈ నెల 5 నుంచి 9వ తేదీవరకు నిర్వహించనున్నారు. ఆదివారం కల్యాణం చూసేందుకు వీఐపీ పాస్‌లు ఏర్పాటు చేయడంతో పాటు రూ.200 టికెట్లు 4,5 తేదీల్లో భక్తులకు అందుబాటులో ఉంచుతున్నామని ఇవ్వనున్నామని ఆలయ ఈఓ జీవీడీఎన్ లీలాకుమార్, చైర్మన్ ఇంజం చెన్నకేశవరావు శుక్రవారం తెలిపారు. కల్యాణాన్ని భక్తి చానల్ ద్వారా ఆదివారం రాత్రి ఎనిమిది గంటల నుంచి కల్యాణం జరిగే సమయంలో ప్రత్యక్ష ప్రసారం చేయనున్నట్లు పేర్కొన్నారు. కల్యాణం రోజున మునేరు అవతల ఆడిటోరియంలో దీక్ష విరమించిన స్వాములకు, వారి పక్కన వచ్చిన వారికి 25 వేల మందికి భోజన ఏర్పాట్లు ఉదయం 10 గంటలకల్లా తయారు చేసి ఉంచుతామని తెలిపారు. గ్రామంలోని పలు ఆలయాల్లో స్వాములు సేద తీరేందుకు టెంట్లు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. భక్తులకు 1.50 లక్షల లడ్డూ ప్రసాదాలను సిద్ధంగా ఉంచుతున్నామన్నారు. కల్యాణం పూర్తయిన తరువాత అమ్మవారి తలంబ్రాలు భక్తులకు పంపిణీ చేస్తామని, ఆలయ అధికారులకు సహకరించాలన్నారు. ఐదు రోజుల పాటు ఆలయం వద్ద అంబులెన్స్, మెడికల్ క్యాంప్‌తో పాటు ఫైర్ ఇంజిన్ అందుబాటులో ఉంచుతామన్నారు. కల్యాణ వేదిక వద్ద స్థల శుద్ధి పూజలు, హోమాల అనంతరం శనివారం పూర్ణాహుతితో ముగుస్తాయన్నారు. ఈఓ, చైర్మన్‌తో పాటు ఎస్సై హరిప్రసాద్, ఈఈ వైకుంఠరావు, ఏఈ రాజు అన్నదాన పరిసరాలు, క్యూలు పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు.